# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 18 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఫామ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఉంది

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసే వారికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక సూచన చేశారు. ఫామ్ ప్లాట్ల పేరిట అనుమతులు లేని లేఔట్లలో ప్లాట్లను కొనుగోలు చేయవద్దని హితవు పలికారు. అనుమతులు లేని లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే ఆ తర్వాత ఇబ్బందులు పడాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఫామ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం ఉందని, అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని లక్ష్మీగూడ గ్రామ సర్వే నెంబర్ 50లోని 1.02 ఎకరాల్లో ఫామ్ ప్లాట్ల పేరిట లేఔట్ వేసి అమ్ముతున్నారంటూ హైడ్రాకు ఫిర్యాదు అందిందని రంగనాథ్ వెల్లడించారు. నిబంధనల మేరకు ఎక్కడా ఫామ్ ప్లాట్లను విక్రయించడానికి లేదని ఆయన వెల్లడించారు. ఫామ్ ల్యాండ్ అంటే 2 వేల చదరపు మీటర్లు లేదా 20 గుంటల స్థలం ఉండాలని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఫామ్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయరాదని స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు వెల్లడించారు.

## ఢిల్లీ , బిహార్‌లలో భూకంపాలు





బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరాదిన వరుస భూకంపాలు సంభవించాయి. సోమవారం తెల్లవారు జామున ఢిల్లీ , పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటు చేసుకోగా, ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధి లోనే బీహార్ రాష్ట్రంలో మరోసారి భూకంపం సంభవించింది. మొదట సోమవారం తెల్లవారు జామున 5.35 గంటల సమయంలో ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్ , గాజియాబాద్ , నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్) ప్రాంతాల్లో 4.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. ధౌలాకాన్ లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలో మీటర్ల లోతున భూకంపం కేంద్రం ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

ఢిల్లీలో కొన్ని సెకన్ల పాటు భూమి తీవ్రంగా కంపించడంతోపాటు భారీ శబ్దం వినిపించినట్టు కొందరు చెబుతున్నారు. అపార్టుమెంట్లు, విద్యుత్ స్తంభాలు ఊగిపోయాయని పేర్కొన్నారు. దీంతో ప్రజలు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. ఢిల్లీలో భూకంపం సంభవించిన గంటల వ్యవధి లోనే బీహార్ రాష్ట్రంలో మరో భూకంపం సంభవించింది. బీహార్ లోని సివాన్ జిల్లాలో సోమవారం ఉదయం 8.02 గంటల ప్రాంతంలో ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.0 గా నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సివాన్‌లో 10 కిమీ లోతున భూకంపం కేంద్రం ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బీహార్ ప్రకృతి వైపరీత్య నిర్వహణ విభాగం అడిషనల్ చీఫ్ సెక్రటరీ ప్రత్యాయ అమృత్ ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టాలు జరిగినట్టు ఇంతవరకు సమాచారం లేదన్నారు. దీనిపై ప్రధాని మోడీ స్పందిస్తూ మళ్లీ ఢిల్లీలో ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రతా చర్యలు పాటించాలని కోరారు. భూ విజ్ఞాన శాఖ మంత్రి జితేంద్రసింగ్ వేదికగా ప్రజలను అప్రమత్తం చేశారు. జాగ్రత్తలు పాటిస్తూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. ఎప్పటికప్పుడు వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఢిల్లీ పోలీసులు ఎమర్జెన్సీకి 112 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని ఎక్స్ పోస్టు ద్వారా ప్రజలకు తెలియజేశారు.

# ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలి

- తాగునీటికి ఇబ్బందులు ఉండొద్దు
- వచ్చే 3 నెలలు అత్యంత కీలకం
- శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను వినియోగించుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని
- టెలిమెట్రీ ద్వారానే ఏపీ, తెలంగాణ నీటి వాటాల లెక్కింపు
- అవసరమైన చర్యలు చేపట్టాలని వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలి
- సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల కింద సాగవుతున్న పంటలకు ప్రణాళిక ప్రకారం నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఎండలు పెరిగిన కొద్దీ తలెత్తే గడ్డు పరిస్థితులను ముందస్తు అంచనా వేసుకొని పంటలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రాబోయే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, పంటలకు సాగునీటి విడుదలపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ఎస్సారెస్పీతో పాటు ప్రధాన ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలు, నీటి వినియోగం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని, సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని చెప్పారు. రాబోయే మూడు నెలలు అత్యంత కీలకమని, రాష్ట్ర మంతటా అన్ని ప్రాంతాల్లో సాగు, తాగునీరు, విద్యుత్తు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని, వెంటనే సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి జిల్లాల వారిగా అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు పంటలు, నీటి విడుదలపై ఆయా జిల్లాల కలెక్టర్లు సంబంధిత ఇరిగేషన్ ఇంజనీర్లతో వెంటనే సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రాజెక్టులు, కాల్వలు, ఆయకట్టులో పంటలు, నీటి విడుదల తీరును కలెక్టర్లు స్వయంగా పరిశీలించాలని సూచించారు. నిర్ణీత ఎజెండాను ఖరారు చేసుకొని అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తగిన ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి కృష్ణా జలాలను వినియోగించుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నిర్ణీత కోటా కంటే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీటిని తరలించకుండా అడ్డుకట్ట వేసేందుకు టెలిమెట్రీ విధానమే పరిష్కారమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

టెలీమెట్రీ విధానం అమలుకు అయ్యే ఖర్చులో సగం నిధులను చెల్లించేందుకు ఏపీ ప్రభుత్వం ముందుకు రావటం లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. టెలీమెట్రీ విధానం అమలుకు అవసరమైన నిధులన్నీ ముందుగా మన ప్రభుత్వమే చెల్లిస్తుందని, వెంటనే టెలిమెట్రీ అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా గారిని ఆదేశించారు. నీటి వాటాల పంపిణీ, నీటి వాటాల వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జల సంఘంపైనే ఉందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నిర్ణీత వాటా కంటే ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఏపీ ఏకపక్షంగా నీటిని తరలించే విషయంపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు.

## యావత్ తెలంగాణ జాతికి హీరో కేసీఆర్



- కేసీఆరే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఘనంగా కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కేసీఆర్ నాకు మాత్రమే కాదు.. యావత్ తెలంగాణ జాతికి హీరో అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కారణజన్ముడు కేసీఆర్ కొడుకుగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతమని చెప్పారు. కేసీఆర్ 71వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలిలో విపక్ష నేత మధుసూధనా చారి, ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యమం కోసం నడుం బిగించిన నాడు మీడియా లేదు, మద్దతు లేద గుర్తుచేశారు. మీడియా, మనీ, మజిల్ పవర్ లేకుండా తెలంగాణను సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఉద్యమాన్ని నడిపారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. తెలంగాణను స్వప్నించి సాకారం చేసిన మహోన్నతుడు కేసీఆర్ అని చెప్పారు. రాష్ట్రంలో ఎవరిని కదిపినా మళ్లీ కేసీఆర్ రావాలంటున్నారని వెల్లడించారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో అందరం కలిసి పనిచేద్దామన్నారు. కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ జాతిది వీరోచితమైన చరిత్ర అని మండలిలో విపక్ష నేత మధుసూదనా చారి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఎంతో నష్టపోయిందని చెప్పారు. ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి కేసీఆర్ చలించిపోయారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటును అడ్డుకునేందుకు ఎన్నో కుట్రలు జరిగాయని వెల్లడించారు. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత కేవలం ఏడాదిలో దేశం మొత్తం మనవైపు చూసేలా తయారు చేశారని చెప్పారు. తెలంగాణను ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. కేసీఆర్ సత్తా ఏంటో చంద్రబాబు, వైఎస్సార్‌కు తెలుసని వెల్లడించారు.

హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే నాలుగు కోట్ల మంది ప్రజల భావోద్వేగమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్‌కు తెలంగాణకు ఉన్న బంధం పేగు బంధమని చెప్పారు. కేసీఆర్ ది తెలంగాణ ప్రజలది తల్లీబిడ్డల బంధమని తెలిపారు. 1969 మలిదశ ఉద్యమ సమయంలో కేసీఆర్ వయసు 15 ఏండ్లని, అప్పుడే జై తెలంగాణ అని

మిగితా 2వ పేజీలో

## కొత్త రేషన్ కార్డులు వెంటనే జారీ చెయ్యాలి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి వెంటనే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన అర్జీలు, కుల గణనతో పాటు గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులు, మీ సేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులకు అవకాశం ఇచ్చినప్పటికీ, మీ సేవా కేంద్రాల వద్ద రేషన్ కార్డులకు ఎందుకు రద్దీ ఉంటుందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ మళ్లీ చేస్తున్నాయని, అందుకే రద్దీ ఉంటుందని అధికారులు వివరణ ఇచ్చారు. వెంటనే కార్డులు జారీ చేస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, ఆలస్యం చేయకుండా వెంటనే కొత్త కార్డులు జారీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని, అయితే ఇప్పటికే కార్డుల కోసం దరఖాస్తు చేసిన కుటుంబాలు మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎన్నికల నియమావళి అమలులో ఉందని, నియమావళి అమలులో లేని జిల్లాల్లో ముందుగా కార్డులను జారీ చేయాలని చెప్పారు. కోడ్ ముగిసిన తర్వాత అన్ని జిల్లాల్లో కొత్త కార్డులు ఇవ్వాలని సూచించారు. కొత్త కార్డులకు సంబంధించి పౌర సరఫరాల విభాగం తయారు చేసిన పలు డిజైన్లను ముఖ్యమంత్రి గారు ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ముస్లిం ఉద్యోగులకు శుభవార్త

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ముస్లిం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులు తమ పని వేళల కంటే గంట ముందే ఇళ్లకు వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. తమ మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. మార్చి 2 నుంచి మార్చి 31 వరకు ఈ వెసులుబాటు ఉంటుంది. ముస్లిం ఉద్యోగులు తమ విధుల నుండి సా.4 గంటలకే తమ ఇళ్లకు వెళ్లేలా అనుమతి కల్పించారు. ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న ముస్లిం ఉద్యోగులు, టీచర్లు, కాంట్రాక్ట్ వర్కర్లు, ప్రభుత్వ రంగం సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్పొరేషన్‌లలో పనిచేసే ఉద్యోగులందరికీ ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని సిఎస్ పేర్కొన్నారు.

## వందేళ్ల ముందుచూపు... పుస్తకావిష్కరణ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ దశాబ్ద కాలం పాటు కృషితో అందించిన ప్రగతి పాలనలో, రాష్ట్ర పునర్నిర్మాణంలో నీళ్ల, నిధులు, నియామకాలకు సంబంధించి బలమైన పునాదులు వేయగలిగారన్న ఆర్బీఐ నివేదిక గణాంకాలతో, జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన “వందేళ్ల ముందుచూపు” పుస్తకాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. సోమవారం నాడు ఎర్రవల్లి నివాసంలో, కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా, ఈ పుస్తకాన్ని గౌరీశంకర్ కేసీఆర్ గారికి అందజేశారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ హోంమంత్రి మహ్మద్ అలీ, వి. ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### దండలు మార్చుకున్న కేసీఆర్ దంపతులు

ఇక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుల్ల కృష్ణమూర్తి కుమారుని వివాహం ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం అదే ఫంక్షన్ హాల్‌లో సత్యనారాయణ వ్రతం ఇతర కార్యక్రమాలు నిర్వహించగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా దంపతులిద్దరూ ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ నిర్వాహకుల కోరిక మేరకు కేసీఆర్, శోభ దంపతులు ఒకరినొకరు దండలు మార్చుకున్నారు. నూతన వధువరులు పుణ్య దంపతులైన కేసీఆర్, శోభలపై పన్నీరు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## కుల గణనతో కాంగ్రెస్ కొరివితో తలగోక్కొంటోంది

- ముస్లింలను బీసీల్లో చేర్చి బీసీలను మోసం చేస్తున్నారు
- 'ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించకుంటే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు.
- ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత ప్రధాన ప్రతిపక్ష పాత్ర బీజేపీదే
- కేంద్ర మంత్రి బండి సంజయ్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కుల గణనతో కాంగ్రెస్ కొరివితో తలగొక్కోంటోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో బీజేపీ మండల అధ్యక్షులతో సోమవారం టీచర్ ఎమ్మెల్సీ సమావేశం నిర్వహించగా.. బండి సంజయ్ కుమార్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'కొందరు మంత్రులు ప్రతి పనికి 15 శాతం కమీషన్ దండుకుంటున్నారు. మంత్రుల్లో, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చింది' అని ఆరోపించారు. కుల గణనతో కాంగ్రెస్ కొరివితో తలగొక్కోంటోందని తెలిపారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బిల్లు పంపతామంటే ఆమోదించడానికి మేమేమైనా ఎడ్డోళ్లమా? అని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారులపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ముఖ్యమంత్రిగా ఉంటూ ఐఏఎస్ అధికారులను ఒక్క తప్పు చేయాలని అంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి చేయొద్దు.. తప్పులు చేయకుండా చూడాల్సిన ముఖ్యమంత్రే దిగజారి మాట్లాడతారా? అని మండిపడ్డారు.

'ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించకుంటే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు.

మిగితా 2వ పేజీలో



## ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు

- ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓవర్‌లోడ్, నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక సామాన్యులకు అందుబాటులో ఉండేందుకు 24 గంటల పాటు బుకింగ్ అందుబాటులో ఉంచామనీ, ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది ట్రాన్స్‌పోర్టర్లు అక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో తగు చర్యలు చేపట్టినట్టు వివరించారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన బృందాలు ఇసుక రీచ్‌లు. స్టాక్ యార్డులు, ఇసుక రీచ్‌ల ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాయని తెలిపారు. ప్రధాన ఇసుక రీచ్‌లకు వెళ్లే రహదారులను గుర్తించి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సంబంధిత అధికారులు నిత్యం వీటిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇసుక కాంట్రాక్టర్లు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రెట్టింపు ఆదాయాన్ని పెంచడంలో ప్రభుత్వానికి సహకరించాలనీ, అదే సందర్భంగా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో నెల రోజుల్లో టీజీఎండీసీలో ఐటీ సేవలను పూర్తి స్థాయిలో అమల్లోకి తెచ్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు చేసేందుకు 98480,94373, 7093914343 నెంబర్లను ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

# తెలంగాణకు కాంగ్రెస్ నుంచే బీసీ సీఎం




- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**బలగం టీవీ, హైదరాబాద్**

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు భవిష్యత్తులో బీసీ వ్యక్తే సీఎం అవుతారని అన్నారు. అది కాంగ్రెస్ నుంచే అవుతారని అన్నారు.

తెలంగాణకు రానున్న రోజుల్లో బీసీ సీఎం వస్తారని.. ఈ ఐదేళ్ల మాత్రం రేవంత్ రెడ్డే సీఎంగా ఉంటారని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. వచ్చే రోజుల్లో రాజకీయాలు అన్నీ బీసీ అజెండాగానే జరుగుతాయని జోస్యం చెప్పారు. అయితే.. బీసీ ముఖ్యమంత్రి అనేది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని.. భవిష్యత్తులో తెలంగాణలో బీసీ వ్యక్తి సీఎం అవుతారని మహేష్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. వచ్చే మంత్రివర్గ విస్తరణలో కూడా బీసీలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. తెలంగాణలో కులగణన చేయడంతోనే తమ నిబద్ధతను నిరూపించు కున్నామని తెలిపారు.

దేశంలో బీజేపీ ప్రభుత్వం చాలా రాష్ట్రాల్లో ఉందని కానీ.. వాళ్లు ఎక్కడా కూడా బీసీ కులగణన చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉంది కాబట్టే తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ కులగణన చేసిందన్నారు. ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా కులగణన చేయలేదని దుయ్యబట్టారుల. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి కూడా అవకాశం ఉంది కానీ చేయడం లేదని విమర్శించారు. కులగణన సర్వేకు చట్టబద్ధత తీసుకొచ్చి కేంద్రానికి పంపిస్తామని.. దాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి బీజేపీకి బీసీలపై ఉన్న చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ బీసీనే అని.. ఆయనే ప్రధాని మోదీతో మాట్లాడి బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్ చేర్చేలా ఒప్పించాలని సూచించారు.ఇదిలా ఉంటే.. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో మంచి కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారంటే అది కాంగ్రెస్ వల్లే సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలని రాహుల్ గాంధీ నిర్ణయించారని తెలిపారు. వచ్చే ఎన్నికలు కూడా బీసీ అజెండాగానే ఉంటాయని తెలిపిన మహేష్ కుమార్ గౌడ్.. ఈ ఐదేళ్లు రేవంత్ రెడ్డే ముఖ్యమంత్రిగా ఉంటారని స్పష్టం చేశారు.

## శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు ప్రభాస్ కు ఆహ్వానం



**బలగం టీవీ, హైదరాబాద్**

దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధ శైవక్షేత్రంగా పేరుగాంచిన శ్రీకాళహస్తిలో ఈ నెల 21 నుంచి మార్చి 6 వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా, ఈ బ్రహ్మోత్సవాలను ఈసారి అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు ప్రముఖులను స్వయంగా ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి, అగ్రకథానాయకుడు నందమూరి బాలకృష్ణల తదితరులను కలిసి ఆహ్వానించారు. తాజాగా బొజ్జల సుధీర్ రెడ్డి పాన్ ఇండియా హీరో ప్రభాస్ ను కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. తాము నిర్వహించే ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. కాగా, శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల ఆహ్వానం అందుకున్న వారిలో ఏపీ మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, నితిన్ గడ్కరీ, పియూష్ గోయల్, లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ ప్రధాని హెచ్ డీ దేవెగౌడ, యంగ్ హీరో నితిన్ తదితరులు ఉన్నారు.

## దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణలో పాలన

- మంత్రి శ్రీధర్ బాబు

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పెద్దపల్లి పట్టణం స్వరూప గార్డన్ లో నియోజకవర్గ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో 57వేల ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందన్నారు. నిరుద్యోగ, యువతకు నైపుణ్యం పెంచేందుకు హైదారాబాద్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 317 జీఓను వెసులుబాటును బట్టి ఉపాధ్యాయులకు సొంత జిల్లాల్లో పనిచేసే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని గుర్తు చేశారు. కులగణన దేశానికి దిక్సూచిగా నిలిచిందని, ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు మాట్లాడే తీరు సరిగాలేదని, చేతనైతే రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మించితీరుతామని, అపోహలొద్దని హామీ ఇచ్చారు. ఈనెల 27 జరిగే కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. సమావేశంలో విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు, ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మాక్కాన్ సింగ్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# యావత్ తెలంగాణ జాతికి హీరో కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

నినదించిన నాయకుడని చెప్పారు. వేల గంటల మేధోమథనం తర్వాత కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. తెలంగాణ కోసం అన్ని పదవులు త్యాగం చేసిన నాయకుడని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ లాంటి ఎంతోమంది మేధావులు కేసీఆర్ వెంట నడిచారన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ను ఎన్నో రకాలుగా వేధించారని చెప్పారు. తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ మొండి పట్టుదలే కారణమని తెలిపారు. తెలంగాణ జైత్రయాత్రనో.. కేసీఆర్ శవయాత్రనో అంటూ ఆమరణ దీక్షకు దిగారని గుర్తుచేశారు. కేసీఆర్ దీక్షకు దిగివచ్చిన కేంద్రం తెలంగాణ ప్రకటించిందని వెల్లడించారు. తెచ్చుకున్న తెలంగాణను అద్భుతంగా తయారు చేసిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. మా కేసీఆరే మళ్లా రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కేసీఆర్, తెలంగాణ ప్రజల నడుమ ఉన్నది పేగుబంధమని చెప్పారు. రేవంత్ రెడ్డి తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ పుట్టినరోజును ఘనంగా నిర్వహించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ పుట్టినరోజును రాష్ట్రమంతా పండుగలా జరుపుకుంటున్నారు.



# ప్రార్థనా మందిరాలపై పిటిషన్ల విచారణ ఏప్రిల్‌కు వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రార్థనా మందిరాల (ప్రత్యేక నిబంధనల) చట్టం 1991కి సంబంధించిన పిటిషన్ల బొత్తిపై విచారణను ఏప్రిల్ మొదటి వారానికి సుప్రీం కోర్టు సోమవారం వాయిదా వేసింది. ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ విషయమై విచారణ జరుపుతుందని ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం తెలియజేసింది. ప్రార్థనా మందిరాల (ప్రత్యేక నిబంధనల) చట్టం 1991 చెల్లుబాటుకు సంబంధించిన కేసులో పలు సరికొత్త పిటిషన్లు దాఖలు కావడం పట్ల సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఉదయం అసహనం వ్యక్తం చేసింది. 1947 ఆగస్టు 15 నాటికి ఉనికిలో ఉన్న ప్రార్థనా మందిరం మతపరమైన లక్షణాన్ని కొనసాగించాలని ఆ చట్టం నిర్దేశిస్తోంది. కక్షిదారు తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ సోమవారం విచారణ నిమిత్తం సరికొత్త పిటిషన్ దాఖలు గురించి ప్రస్తావించినప్పుడు 'మేము దానిని చేపట్టలేకపోవచ్చు' అని సిజెఐ స్పష్టం చేశారు. సోమవారం కేసుల విచారణ ప్రక్రియకు ముందు సీనియర్ న్యాయవాది ఆ విషయం ప్రస్తావించారు. 'పిటిషన్ల దాఖలుకు ఒక పరిమితి ఉంది. అంత ఎక్కువగా ఐఎలు (మధ్యంతర అర్జీలు) దాఖలు అయ్యాయి. మేము వాటిని చేపట్టలేకపోవచ్చు' అని సిజెఐ చెప్పారు. వాటికి మార్చిలో ఒక తేదీ ఇవ్వవచ్చునని ఆయన సూచించారు.

వారణాసిలో జ్ఞాన్‌వాపి, మథురలో షాహి ఈద్గా మసీద్, సంభాల్‌లో షాహి జమా మసీదు సహా పది మసీదుల అసలు మతపరమైన లక్షణాలు నిర్ధారించుకోవడానికి సర్వే కోరుతూ వివిధ హిందు సంస్థలు దాఖలు చేసిన దాదాపు 18 దావాల్లో విచారణ ప్రక్రియలను సర్వోన్నత న్యాయస్థానం నిరుడు డిసెంబర్ 12 నాటి ఉత్తర్వు ద్వారా నిలిపివేసింది. సంభాల్‌లో ఘర్షణల్లో నలుగురు వ్యక్తులు మరణించిన విషయం విదితమే. కోర్టు ఆ తరువాత ఆ పిటిషన్లు అన్నిటినీ ఫిబ్రవరి 17న విచారిస్తామని ప్రకటించింది. 1991 చట్టం అమలు కోరుతూ డిసెంబర్ 12 తరువాత పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిలో ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాది పార్టీ నేత, కైరానా ఎంపి ఇక్రా చౌదరి, కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్లు కూడా వాటిలో ఉన్నాయి.

# కుల గణనతో కాంగ్రెస్ కొరివితో తలగోక్కొంటోంది

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలను తొలగించి బీసీ జాబితా పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత మాదే' అని బండి సంజయ్ ప్రకటించారు. రేవంత్ రెడ్డి బాకీలు మోపుతూ ప్రజలను తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత తెలంగాణలో అధికారంలోకి వచ్చేదాకా ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేది బీజేపీ అని పేర్కొన్నారు. క్రైస్తవుల్లో చాలా మంది ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకుంటూ ఎస్సీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

బీసీల్లో ముస్లింలను చేర్చి బీసీలను మోసం చేస్తున్నారని చెప్పారు. ఇంత జరుగుతుంటే సంఘాలు ఎందుకు స్పందించడం లేదు? అని రేవంత్ రెడ్డిని బండి సంజయ్‌ప ప్రశ్నించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాయడమే కుల సంఘాల పనా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులను పరిచయం చేశారు.

## అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన పార్టీ బీజేపీ

**ఏడీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్‌లో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన జాతీయ పార్టీ బీజేపీ నిలిచింది. దేశంలోని జాతీయ పార్టీలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన ఆదాయాల వివరాలతో 'అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్- ఏడీఆర్' ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం 2023-24లో బీజేపీకి ఏకంగా రూ.4,340.47 కోట్ల ఆదాయం వచ్చింది. భారత్‌లోని ఆరు జాతీయ పార్టీల మొత్తం ఆదాయంలో 74.57 శాతానికి సమానమైన ఆదాయాన్ని ఒక్క బీజేపీయే సంపాదించింది. కమలదళం తమ ఆదాయంలో కేవలం 50.96 శాతం (రూ.2,211.69 కోట్లు) నిధులనే ఖర్చు చేసింది. ఇదే వ్యవధిలో కాంగ్రెస్ పార్టీకి రూ.1,225.12 కోట్ల ఆదాయం రాగా, 83.69 శాతం (రూ.1,025.25 కోట్లు) నిధులను ఖర్చు చేసింది. 2023-24లో జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాల ఆదాయంలో సింహభాగం ఎన్నికల బాండ్ల రూపంలోనే వచ్చింది. ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీకి అత్యధికంగా రూ.1,685.63 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.828.36 కోట్లు, ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.10.15 కోట్ల విరాళాలు అందాయి.

## ఆలయం వద్ద పసికందు

**బలగం టీవీ, హైదరాబాద్**

అల్వాల్ పీఎస్ పరిధిలో ఘటనఅప్పుడే పుట్టిన శిశువును గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఆలయం వదిలి వెళ్లిన హృదయవిదారక ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ పీఎస్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదేవినగర్ సమీపంలోని పోచమ్మ దేవాలయం వద్ద ఓ పసికందు(మగ శిశువు)ను గుర్తు తెలియని వ్యక్తులు వదిలిపెట్టి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున పసికందును గమనించిన స్థానికులు అల్వాల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని శిశువుకు ప్రథమ చికిత్స కోసం వెంటనే నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు బాబును పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్టు నిర్ధారించారు. పోలీసులు ఈ విషయాన్ని చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు తెలియజేయగా వారు శిశువు సంరక్షణ బాధ్యతలు తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బొప్పాపూర్‌లో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



### అప్పుల బాధతో మద్యానికి బానిసై...

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం బొప్పాపూర్ గ్రామానికి చెందిన హనుమ కనకయ్య(40) కూతురు వివాహం కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి తన గదిలో నిద్రపోయాడు. ఉదయం ఏడు గంటలకు తన కుమారులు నవీన్ తలుపులు తట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లిలో తెలంగాణా జాతిపిత కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలసి కొండగట్టు శ్రీ ఆంజనియ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు చొప్పదండి మాజీ శాసన సభ్యులు సుంకె రవిశంకర్. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ పదేండ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని అన్నారు. కానీ పదేండ్లలో జరిగిన అభివృద్ధి గడిచిన సంవత్సర కాలంలో చాలా నష్టానికి గురవుతుందని విమర్శించారు.కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు.కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు.

# కందుల కొనుగోలుకు చర్యలు చేపట్టాలి..

**-తేమ 12 శాతం లోపు ఉన్న కందులకు 7550/- మద్దతు ధర**

**-ఫిబ్రవరి 22 నుంచి కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**

ఫిబ్రవరి 22 శనివారం నుంచి జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో మొత్తం 1129 ఎకరాలలో కందుల సాగు జరిగిందని, మొత్తం 6 వేల 211 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అన్నారు.ఐకెపి కేంద్రాల ద్వారా గంభీరావు పేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్ళపల్లి, ఎల్లారెడ్డి పేట, చందుర్తి మండలాల్లో ఐకెపి కేంద్రాల మిగిలిన చోట్ల పి.ఏ.సి.ఎస్. కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు.

ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేయాలో అధికారులు నిర్ణయించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులలో, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కందుల కొనుగోలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల నుంచి సమీప గోడౌన్లకు కందుల తరలింపు కోసం రవాణా కొరకు టెండర్ ల ద్వారా అవసరమైన వాహనాలు అందుబాటులోకి పెట్టాలని, కందుల కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు, వెయింగ్ యంత్రాలు తేమ యంత్రాలు, టార్పాలిన్ లు, ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కందులు కొనుగోలుకు సంబంధించి కనీసం మద్దతు ధర, పంట నాణ్యత పరిశీలన,12 తేమ శాతం , ఇతర నాణ్యత ప్రమాణాలపై అధికారులకు అవసరమైన శిక్షణ



కార్యక్రమం రేపటి నుంచి అందించాలని, ఫిబ్రవరి 22 శనివారం నుంచి జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. తేమ 12 శాతం లోపు ఉన్న కందులకు రూ 7550/- మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని, కందుల పంట సంబంధించి అవసరమైన నాణ్యత ప్రమాణాలను రైతులకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెఫెడ్ అధికారి హబీబ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలిబేగం, డి ఆర్ డి ఓ శేషాద్రి, డి సి ఓ రామకృష్ణ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**- తంగళ్లపల్లి మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయం ఆకస్మిక తనిఖీ**

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**



నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రతి రోజూ కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.తంగళ్లపల్లిలోని సిరిసిల్ల మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వంటగదిలోనీ బియ్యం, కూరగాయలు, పండ్లు, కోడి గుడ్లు,ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.ఆర్ఓ ప్లాంట్ పరిశీలించి, స్వయంగా కలెక్టర్ ఆ నీటిని తాగి నాణ్యతను తనిఖీ చేశారు.నాణ్యత ప్రమాణాలు మేరకే ఆహార పదార్థాలు,పండ్లు, కూరగాయలు, కోడి గుడ్లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారతూ కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిత్యం చదివించాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూసా ఫాతిమా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, బీజేపీ గల్లీలో లొల్లి డిల్లీలో దోస్తీ..

**- బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో బలహీన పడ్డది.. అందుకే నేడు పోటీలో లేదు**

**- నరేందర్ రెడ్డినీ బారీ మెజారిటీతో గెలిపించాలి..**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలలో లేకుండా బీజేపీ తో ఒక లోపాయకారి ఒప్పందం చేసుకున్నారని, బీజేపీ అభ్యర్థులకు లోలోపట మద్దతు తెలుపుతున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.సోమవారం సిరిసిల్ల పట్టణంలోనీ కె కన్వెన్షన్ హాల్లో మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ఈ ఎన్నిక 42 అసెంబ్లీ నియోజకవర్గలలో జరుగుతున్న ఎన్ని కని,గ్రామాల్లో ఉన్న పట్టభద్రులకు 50 మందికి ఒకరిని ఇంచార్జి గా పెట్టుకుని ఎన్నికల్లో ముందుకు పోవాలని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో డీఎస్సీ వేస్తే మళ్ళీ ప్రజా ప్రభుత్వంలో డీఎస్సీ వేయడం జరిగిందని,బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల లో ఇచ్చిన ఉద్యోగాలను మన ప్రభుత్వం పది నెలల్లో ఇవ్వడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని,రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఆనాడు రాష్ట్రపతి ఎన్నికల్లో ,నల్ల చట్టాల అమలు సమయంలో బిఆర్ఎస్ వారు బీజేపీ కి మద్దతు ఇచ్చారని, బిఆర్ఎస్ బీజేపీ వ్యవహార శైలి గల్లీలో లొల్లి డిల్లీలో దోస్తీ అన్న విధంగా ఉందని అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి సున్నా సీట్లు రావడం జరిగిందని, ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీ ఫైనలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఫైనలని, మీరు ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలలో కష్టపడితే మీకు మీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉపయోగపడుతాయని అన్నారు. మండలాల వారిగా గ్రామాల వారిగా ప్రతి ఒక్కరు కష్టపడాలని,బూతుకు ఒక ఇంచార్జి పెట్టి ఎన్నికలో ముందుకు పోవాలని,ఎన్నికల రోజు బూతు ఇంచార్జిలు ఇతర ప్రాంతాల్లో ఉన్న పట్టభద్రులు వచ్చి ఓటు వేసేలా చూడాలని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలతో ప్రజల్లోకి వెళ్ళే అవకాశం ఉందని,కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అందరికీ వివరించాలని అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డినీ బారీ మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని అన్నారు. బిఆర్ఎస్ క్షేత్రస్థాయిలో బలహీన పడ్డది కాబట్టి నేడు పోటీలో లేదని,బల్మూరి వెంకట్ ప్రతిపక్షంలో అనేక ఆందోళనలు చేసి ప్రజలను చైతన్యవంతం చేశారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులపై అనేక అక్రమ కేసులను పెట్టారని,నేడు ప్రజా ప్రభుత్వంలో టిఆర్ఎస్ నాయకులపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అన్నారు. ఆనాడు కేటీఆర్ సిరిసిల్ల కి వస్తే నేరేళ్లలో ముళ్ళ కంచెలు వేసే వారని,ప్రజా ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా వచ్చి తమ సమస్యలు చెప్పుకుంటున్నారని,అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పాటు పడుతుందని అన్నారు.ఈ కార్యక్రమం లో సిరిసిల్ల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**బలగం టీవీ , వేములవాడ**



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ చర్చించారు..కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు ప్రతి ఒక్కరూ గడపగడపకు వెళ్లి పట్టభద్రులను కలిసి మన ప్రభుత్వం చేపడుతున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలు వివరించి పట్టభధ్రుల ఓట్లు అడగాలని సూచిం చారు.గత ఎన్నికల్లో ఎలా కష్టపడ్డారో అదే విధంగా ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కోసం మనందరం కష్టపడి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి,వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బహుమతిగా ఇవ్వాలన్నారు.. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

# ఉప్పల్‌లో 9 మ్యాచ్‌లు



బలగం టీవీ, హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) 2025 షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. మార్చి 22 నుంచి మే 18 వరకు 70 లీగ్ మ్యాచులు జరగనున్నాయి. ప్లే ఆఫ్స మే 20 నుంచి మే 25 వరకు నిర్వహించ నున్నారు. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు కోల్ కతా వేదికగా తలపడనున్నాయి.

ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 23న రాజస్థాన్ రాయల్స్ తో హైదరాబాద్ వేదికగా ఆడనుండగా ఉప్పల్ వేదికగా మొత్తం 9 మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఐపీఎల్ 2025 షెడ్యూల్ ప్రకారం.. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియం వేదికగా మొత్తం 9 మ్యాచ్‌లు జరగనున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్‌లో ఆ జట్టు ఏడు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. గతేడాది సన్‌రైజర్స్ హైదరాబాద్ రన్నరప్‌గా నిలిచిన విషయం తెలిసిందే. దాంతో ఉప్పల్ వేదికగా క్వాలిఫయర్-1తో పాటు ఎలిమినేటర్ మ్యాచ్‌లు కేటాయించారు. ఈ క్రమంలోనే ఉప్పల్ వేదికగా మొత్తం 9 మ్యాచ్‌లు జరగనున్నాయి.

**హైదరాబద్ వేదికగా జరిగే మ్యాచ్ తేదీలు..**

మార్చి 23, మార్చి 27, ఏప్రిల్ 6, ఏప్రిల్ 12, ఏప్రిల్ 23, మే 5, మే10 జరిగే సన్ రైజర్స్ మ్యాచులు హైదరాబాద్ వేదికగా జరగనున్నాయి.

### సన్ రైజర్స్ షెడ్యూల్

మార్చి 23: సన్ రైజర్స్ వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ – రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్ (మధ్యాహ్నం 3.30 గంటలకు)

మార్చి 27: సన్ రైజర్స్ వర్సెస్ లఖ్ నవూ సూపర్ జెయింట్స్ – రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్ (రాత్రి 7.30 గంటలకు)

మార్చి 30: సన్ రైజర్స్ వర్సెస్ దిల్లీ క్యాపిటల్స్ – డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి క్రికెట్ స్టేడియం, వైజాగ్ (మధ్యాహ్నం 3.30 గంటలకు)

ఏప్రిల్ 3 :సన్ రైజర్స్ వర్సెస్ కోల్‌కతా నైట్ రైడర్స్ – ఈడెన్ గార్డెన్స్, కోల్‌కతా (రాత్రి 7.30 గంటలకు)

ఏప్రిల్ 6 : సన్ రైజర్స్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ – రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్ (రాత్రి 7.30 గంటలకు)

ఏప్రిల్ 12 : సన్ రైజర్స్ వర్సెస్ పంజాబ్ కింగ్స్ – రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్ (రాత్రి 7.30 గంటలకు)

ఏప్రిల్ 17 : సన్ రైజర్స్ వర్సెస్ ముంబయి ఇండియన్స్ – వాంఖడే స్టేడియం, ముంబయి (రాత్రి 7.30 గంటలకు)

ఏప్రిల్ 23 : సన్ రైజర్స్ వర్సెస్ ముంబయి ఇండియన్స్ – రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్ (రాత్రి 7.30 గంటలకు)

ఏప్రిల్ 25 : సన్ రైజర్స్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ – చిదంబరం స్టేడియం, చెన్నై (రాత్రి 7.30 గంటలకు)

మే 2 : సన్ రైజర్స్ వర్సెస్ గుజరాత్ టైటాన్స్ – నరేంద్ర మోడీ స్టేడియం, అహ్మదాబాద్ (రాత్రి 7.30 గంటలకు)

మే 5 : సన్ రైజర్స్ వర్సెస్ దిల్లీ క్యాపిటల్స్ – రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్ (రాత్రి 7.30 గంటలకు)

మే 10 : సన్ రైజర్స్ వర్సెస్ కోల్‌కతా నైట్ రైడర్స్ – రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, హైదరాబాద్ (రాత్రి 7.30 గంటలకు)

మే 13 : సన్ రైజర్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు – చిన్నస్వామి స్టేడియం, బెంగళూరు (రాత్రి 7.30 గంటలకు)

మే 18 : సన్ రైజర్స్ వర్సెస్ లఖ్ నవూ సూపర్ జెయింట్స్ – ఉషవ బీఆర్ఎస్ఏబీవీ ఎకానా క్రికెట్ స్టేడియం, లఖ్ నవూ (రాత్రి 7.30 గంటలకు)

## తెలుగురాన్ని అమ్మాయిలనే ఎంకరేజ్ చేస్తాం



**నిర్మాత ఎస్‌కేఎన్**

బలగం టీవి, హైదరాబాద్

తెలుగు రాని అమ్మాయిలనే ప్రోత్సహించాలని అనుకుంటున్నామని ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'లవ్‌టుడే' సినిమాతో తెలుగు ఆడియెన్స్‌కు దగ్గరైన ప్రదీప్ రంగనాథన్ తాజాగా 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. డైరెక్టర్ అశ్వత్ మారిముత్తు ఈ సినిమాను తెరకెక్కించారు. అనుపమ పరమేశ్వరన్, కాయల్ లోహిదు హీరోయిన్లుగా నటించారు. ఫిబ్రవరి 21న ఈ సినిమా రిలీజ్ కానుంది. మేకర్స్ ఆదివారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. అయితే ఈ ఈవెంట్‌కు హాజరైన 'బేబీ' సినిమా ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'అనుపమ తెలుగువారికి ఓ ఎమోషన్. ఆమె యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యి ఉంటారు. తెలుగు వచ్చిన అమ్మాయిల కంటే తెలుగు రాని అమ్మాయిలనే మేం ఎక్కువగా లవ్ చేస్తాం. ఎందుకంటే తెలుగు వచ్చిన అమ్మాయిలను ప్రోత్సహిస్తే ఏం జరుగుతుందో తర్వాత నాకు తెలిసి వచ్చింది. అందుకే ఇక నుంచి తెలుగు రాని అమ్మాయిలను ఎంకరేజ్ చేయాలని నేను, నా డైరెక్టర్ సాయి రాజేశ్ అనుకుంటున్నాం' అని అన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

నిర్మాత ఎస్‌కేఎన్ 2023లో 'బేబీ' సినిమాతో భారీ విజయం అందుకున్నారు. డైరెక్టర్ సాయి రాజేశ్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ, తెలుగమ్మాయి వైష్ణవి చైతన్య లీడ్ రోల్స్‌లో నటించారు.



## చిరు దేవుడి లాంటి వారు

**బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా**

బలగం టీవి, హైదరాబాద్

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా చిరంజీవి గురించి మాట్లాడుతూ ఊర్వశి రౌతేలా పొగడ్తల వర్షం కురిపించింది. చిరు తనకు దేవుడి లాంటి వారని ఆమె అన్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ తన తల్లి కాలికి ఫ్రాక్చర్ అయ్యి, నొప్పితో బాధపడుతున్నారని మెగాస్టార్‌కు చెప్పగా, ఆయన వెంటనే వైద్యులతో మాట్లాడి తన తల్లికి మెరుగైన వైద్యం అందేలా చేశారని చెప్పారు. మెగాస్టార్ చిరంజీవి అలా చెప్పడం కారణంగానే తన అమ్మకు సర్జరీ బాగా జరిగిందని, ఆమె తన సమస్య నుంచి పూర్తిగా కోలుకుందని, ఇప్పుడు తన తల్లికి ఎలాంటి సమస్య లేదని వెల్లడించింది. అలాగే మెగాస్టార్ చిరంజీవికి తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని కామెంట్స్ చేసింది.

## 'రాజమౌళి సినిమాల్లో లాజిక్ ఉండదు'

**కరణ్ జోహార్**

బలగం టీవి, హైదరాబాద్

రాజమౌళి సినిమాల్లో ఎలాంటి లాజిక్ ఉండదు అని కరణ్ జోహార్ సంచలన కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "మనం ఎంచుకున్న కథను నమ్ముకోవడమే అన్నిటికన్న ముఖ్యం. సినిమా నచ్చితే ఎవరూ లాజిక్స్ పట్టించుకోరు. ఉదాహరణకి రాజమౌళి సర్ సినిమాల్లో లాజిక్స్ గురించి ఎవరూ పట్టించుకోరు. ఎందుకంటే అది ఆయనకు కథపై ఉండే నమ్మకం. యానిమల్, ఆర్ఆర్ఆర్, గదర్ ఈ సినిమాలు అన్ని ఇదే ఫార్ములాతో హిట్ అయ్యాయి" అని అన్నారు.

## కరాచీ స్టేడియంలో ఎగరని భారత్ జెండా..!



**మండిపడుతున్న ఇండియా ఫ్యాన్స్**

బలగం టీవి, హైదరాబాద్

2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఈ నెల 19న ప్రారంభం కానుంది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వబోతున్నది. అయితే, భారత్ జట్టు మ్యాచులన్నీ దుబాయిలో ఆడనుంది. అయితే తాజాగా ఓ సంఘటన వివాదానికి దారి తీసింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏదైనా టోర్నీ జరుగుతున్న సమయంలో.. టోర్నీలో పాల్గొనే జట్లకు సంబంధించిన జెండాలను ఎగుర వేయాల్సి ఉంటుంది. అయితే చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా కరాచీ స్టేడియంలో భారత జెండాను పాకిస్థాన్ ఎగుర వేయలేదు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు భారత జట్టు అభిమానులు పాక్ చర్యలపై మండిపడుతున్నారు.

భారత్ జెండా మినహా, టోర్నీలో పాల్గొంటున్న మిగిలిన 7 దేశాల జెండాలు అక్కడ ఏర్పాటు చేసినట్లు వీడియోలో కనిపిస్తోంది. అన్ని దేశాల జాతీయ జెండాలు ప్రదర్శించాల్సిన చోట భారత పతాకం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అయితే భద్రతా కారణాల వల్ల ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్‌కు భారత్ వెళ్లడం లేదు. పాకిస్థాన్‌కు రావాలని పీసీబీ పలుమార్లు అభ్యర్థించినా బీసీసీఐ వాటిని తిరస్కరించింది. దీంతో టీమ్‌ఇండియా మ్యాచ్‌లన్నీ తటస్థ వేదిక దుబాయ్‌లో జరగనున్నాయి. భద్రత కారణాలు చూపి టీమ్‌ఇండియా పాక్‌లో పర్యటించకపోవడం వల్లే, పీసీబీ ఇలా భారత్ జెండా ప్రదర్శించలేదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

## 'మజాకా' పాట షూటింగ్ లైవ్..




బలగం టీవి, హైదరాబాద్

సందీప్ కిషన్ తాజా చిత్రం మజాకా. ధమాకా ఫేం త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నాడు. పెళ్లి చూపులు ఫేం రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తుంది. రావు రమేశ్, మన్మథుడు ఫేం అన్షు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 26న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ మూవీ టీం తొలిసారి సరికొత్త ప్రయోగం చేస్తోంది. ఈ మూవీ నుంచి రావులమ్మ సాంగ్ లైవ్ ఫిల్మ్ షూట్ ఎలా ఉండబోతుందో తెలియజేసింది. సాంగ్ షూట్‌కు సంబంధించిన ఫుల్ వీడియోను షేర్ చేసింది. ఇండస్ట్రీలో తొలిసారి ఇలాంటి ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకొస్తూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని ఏకే ఎంటర్ టైన్ మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

## మహానటి కృష్ణవేణి ఇక లేరు



బలగం టీవి, హైదరాబాద్

రఘుపతి వెంకయ్య పురస్కార గ్రహీత.. తొలి తెలుగు మహిళా సినీ నిర్మాత, వెండితెర నటి, స్వీయ గాయనీ, కృష్ణవేణి (102) ఆదివారం ఉదయం కన్నుమూశారు. కొన్ని రోజులుగా వయోభార సమస్యలతో బాధపడుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. తెలుగు సినీ రంగంలో తొలి మహిళా నిర్మాతగా కృష్ణవేణి పేరు సంపాదించారు. ఎందరో మహా మహ నటులను, గాయకులను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేశారు. ఎన్టీఆర్‌ను మన దేశం సినిమాతో తెరకు పరిచయం చేశారు నిర్మాత కృష్ణవేణి. ఎన్టీఆర్ తో పాటు ఘంటసాల వెంకటేశ్వరరావు, గాయని పి.లీల వంటి ఎంతోమంది ప్రముఖులను మనదేశం చిత్రంతో ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఆ సినిమాకు ఓ వైపు నిర్మాతగా వ్యవహరిస్తూనే ఎన్టీఆర్‌కు జంటగా అందులో నటించారు. బాలనటిగా, నటిగా, నిర్మాతగా ఎన్నో మరుపురాని చిత్రాలను పరిశ్రమకు అందించారు. ఆమె మరణం పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో 1924 డిసెంబర్ 24న కృష్ణవేణి జన్మించారు. డ్రామా ఆర్టిస్ట్‌గా కెరీర్‌ను ఆరంభించిన కృష్ణవేణి.. 1936లో విడుదలైన సతీ అనసూయతో బాలనటిగా సినీరంగంలోకి అడుగుపెట్టారు. 1939లో మీర్జాపురం జమీందార్‌తో ఆమె వివాహం జరిగింది.